

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో....

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి నరసింహారావు దర్శించుకున్నారు.



ముగిసిన పవిత్రోత్సవాలు

గంపలగూడెం: నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి.

బండ్లమ్మ అమ్మకు పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం) : బాపట్ల జిల్లా చందోలులోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శ్రావణ మంగళ మహాగౌరిగా, అభయ ప్రదాయినిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

బాపట్ల జిల్లాలో 5,152 కొత్త పెన్షన్లు

- గుంటూరు జిల్లాలో 5,614 పెన్షన్లు మంజూరు
- సెప్టెంబర్ 1న అందజేత



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారుల సంఖ్య గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీగా పెరిగింది. ప్రతి ఆరు నెలలకొకసారి ప్రభుత్వం కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేస్తుంది. తాజాగా గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీగా కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. గుంటూరు జిల్లాలో 5,614, బాపట్ల జిల్లాలో 5152 పింఛన్లు మంజూరయ్యాయి. కొత్త పింఛన్లను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అందించనున్నారు.

నేడు అరుణాచలంకు ఆర్టీసీ బస్సు సిద్ధం


సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంకు అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. 31న అరుణాచలం ప్రదక్షిణ, దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం బయలుదేరి కంచి మీదుగా సెప్టెంబర్ ఒకటిన సత్తెనపల్లి వస్తుందని వివరించారు. టికెట్ ధర రాను, పోను ఒక్కొక్కరికి రూ.1,900 మాత్రమేనని పేర్కొన్నారు. టికెట్లు కావాల్సిన వారు 99592 25429, 63049 59773 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతం




నరసరావుపేట: స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో ఈ నెల 20వ తేదీ నుంచి అగ్నిపథ్ పథకంలో భాగంగా నిర్వహించిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతమైందని కల్నల్ పునీత్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ర్యాలీలో విధులు నిర్వహించిన అధికారులను కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయమన్నారు. సహాయ సహకారాలు అందజేసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు మెమెంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 3711 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 140, బ్యాంక్ కెనాల్‌కు 988, తూర్పు కెనాల్‌కు 330, పశ్చిమ కెనాల్‌కు 150, నిజాంపట్నం కాలువకు 285, కొమ్మమూరు కాల్వకు 1520 క్యూసెక్కులు విడుదల చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 854.20 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2800, గరిష్ట ధర రూ.4600, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.

విద్యయోత్సవం



'గౌరవ'ం : అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) రవిశంకర్ అయ్యన్నార్‌కు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



'పట్టా'భిషేకం : న్యాయవిద్యలో బంగారు పతక విజేత ఎం.రోజాకు పట్టా అందిస్తున్న గవర్నర్



'మెడలో' స్వర్ణశోభితం : మూడు గోల్డ్ మెడల్స్ పొందిన బి.బాలభవానీకి పతకం వేస్తున్న గవర్నర్

ఎగసిన సంతోషాల సిరులు.. ఆనందబాష్పాలు రాల్చిన ఉద్విగ్న క్షణాలు.. సన్నిహితులు, కుటుంబ సభ్యుల అభినందన మందార మాలలు.. ఆచార్యులు అందించిన ఆశీస్సుల మంగళ వచనాలు.. సహచర విద్యార్థుల కేరింతల కరతాళ ధ్వనులు.. జీవితంలో చిరస్థాయిగా మిగిలే మధుర జ్ఞాపకాల ఉషస్సులు.. వీటన్నింటి సమాహారమై మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మురిసింది. 'విద్య'యోత్సవ వేదికై మెరిసింది. స్నాతకోత్సవం వేళ.. సంబరమై నవ్వులు చిందించింది.

- వైభవంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- పట్టాలు, పతకాలు, బహుమతుల గ్రహీతల ఆనందోత్సాహాలు
- యూనివర్సిటీలో పండుగ వాతావరణం





'ఆన'ందం : పట్టాల గ్రహీతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. విద్యార్థులు ఆనందంగా వేడుకలో పాల్గొన్నారు. ప్రత్యేక గౌన్‌లు, రోబ్‌లు ధరించి గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్‌లు, డిగ్రీలు, బంగారు పతకాలు అందుకున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

యూనివర్సిటీ చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఏఎన్‌యూలోని డైక్‌మెన్ ఆడిటోరియం వద్ద వీసీ ఆచార్య పి.రాజశేఖర్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఖాన్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించిన అనంతరం ప్రత్యేక గదిలో స్నాతకోత్సవ దుస్తులు ధరించిన గవర్నర్, యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్నాతకోత్సవ ప్రక్రియకు ఆమోదం తెలిపారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్, డీన్‌లు, స్నాతకోత్సవ వేదికపైకి చేరుకున్నారు. వీసీ యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధి నివేదిక సమర్పించారు. సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీ చాన్సలర్, గవర్నర్ జస్టిస్ నజీర్ పట్టాలు, బంగారు పతకాలు, డాక్టరేట్ గ్రహీతలతో వాగ్దానం చేయించారు. 30 మంది పీహెచ్‌డీ, డిగ్రీలు, బంగారు పతకాలను గవర్నర్ చేతులమీదుగా అందుకున్నారు. స్నాతకోత్సవంలో మొత్తంగా 260 పీహెచ్‌డీ పట్టాలు, 235 బంగారు పతకాలు, 18 నగదు బహుమతులు ప్రదానం చేశారు.

సెల్ఫీలు, ఫొటోల కోలాహలం

స్నాతకోత్సవం జరిగిన డైక్‌మెన్ ఆడిటోరియం పట్టాలు, పతకాల గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఆలింగనాలు, అభినందనలు సెల్ఫీలు, ఫొటోలతో కోలాహలంగా మారింది. డిగ్రీలు, పట్టాలు తీసుకున్న వారు తమ గురువులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎన్‌యూకు అంతర్జాతీయ ఖ్యాతి

వీసీ పి.రాజశేఖర్ ఏడాది కాలంలో యూనివర్సిటీ సాధించిన సమగ్రాభివృద్ధిని వివరించారు. విద్య, పరిశోధన, బోధన, మౌలిక వసతుల కల్పనలో ఏఎన్‌యూ అంతర్జాతీయ స్థాయిలో వృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఏడాదిలో అనేక జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు సొంతం చేసుకుందని చెప్పారు. విదేశీ అధ్యాపకులు ఏఎన్‌యూలోనే ఉండి ఒక సెమిస్టర్ బోధించే విధానం అమల్లోకి తెస్తున్నామని వెల్లడించారు. ఏడాదిగా ఏఎన్‌యూ 448 రీసెర్చ్ పబ్లికేషన్స్, 15 పేటెంట్‌లు సాధించిందని వీసీ సగర్వంగా ప్రకటించారు.

గవర్నర్ చేతుల మీదుగా 30 మందికి..

స్నాతకోత్సవంలో మొత్తం 30 మందికి పీహెచ్‌డీ పట్టాలు, బంగారు పతకాలు, నగదు బహుమతులను గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ప్రదానం చేశారు. వీరిలో గౌరవ డాక్టరేట్ అందుకున్న అడిషనల్ డీజీపీ ఎ.రవిశంకర్ అయ్యనార్, ఎ.చంద్రభాను రెడ్డి, ఇ.షీల (కామర్స్), కె.పృథ్వీరాజు(హెచ్‌ఆర్ఎం), జి.శ్రీరామకృష్ణారావు , ఎస్‌టీవీ ఆనంద లక్ష్మి, ఎం.మేరి (ఎడ్యుకేషన్), వి.బాలాజి, డి.ఉమా శంకర్ చింతల, కె.శంకర రాజశేఖర్ (ఇంజినీరింగ్), ఆర్.వెంకటేశ్వర్లు(సంస్కృతం), జి.సంపత్ కుమార్, పి.సుధా కిరణ్ కుమార్ (ఇంగ్లిష్), పి.చిరంజీవి, కె.పార్వతిబాయి, ఎం.రోజా (న్యాయశాస్త్రం), ఎస్.లక్ష్మీసాయి సుధా శ్రీవాణి(బయోటెక్నాలజీ), ఎస్.మంజుల శ్రీవేణి(జువాలజీ), ఎస్.రత్నమంజరి (బోటనీ), కె.శ్రీహర్ష, ఎ. మేరీ మనోరంజని, పి.భాగ్య రేఖ(ఫార్మసీ), ఎం.సత్తార్ ఖాన్, డి.సురేష్, వి.నాగ దుర్గ (ఫిజికల్ ఎడ్యుకేషన్), పి.వేణుగోపాలరావు(మాథమాటిక్స్), ఎ.వెంకట శేఖర్(ఫిజిక్స్), బాలభవాని(కెమిస్ట్రీ), పి.రాజకుమార్, బి.ఆశి రత్నం (అంబేడ్కర్ చైర్), ఎస్ రఘు(సోషల్ వర్క్), సీహెచ్ జ్యోతి (ఉమెన్ స్టడీస్), ఉన్నారు. మిగిలిన వారికి వీసీ రాజశేఖర్ పట్టాలు, పతకాలు, బహుమతులు అందజేశారు.

దొంగ ఓట్లు టీడీపీ ఘనతే

- దొంగే దొంగ అన్నట్టు బాబు తీరు
- ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజం



చీరాల: దొంగ ఓట్ల విషయంలో దొంగే దొంగ అన్నట్లుగా ఉంది చంద్రబాబు నాయుడు తీరని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీ పోతుల సునీత విమర్శించారు. చీరాలలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంగళవారం మాట్లాడారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ఓడిపోతానని చంద్రబాబు నాయుడికి భయం పట్టుకుందన్నారు. 2014–19 వరకు చంద్రబాబు అధికారంలో ఉండి రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షలు దొంగ ఓట్లు చేర్పించిన విషయం బయట పడిందన్నారు. దొంగఓట్లు చేర్పించిన విషయం బయట పడటంతో ఢిల్లీ వెళ్లి ఎన్నికల కమిషనర్‌కి ఫిర్యాదు చేయడం నాటకంగా మారిందన్నారు. దొంగ ఓట్లపై ఫిర్యాదు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించడంలా ఉందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిజాయితీగా ప్రతి ఓటుకూ ఆధార్ అనుసంధానం చేయాలని కోరుతోందని గుర్తుచేశారు. చంద్రబాబు నాటకాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదనే బాబును ఓడించారని గుర్తుంచు కోవాలన్నారు. ప్రజలు ఓడించినా ఇంకా బుద్ధి రాకుండా ప్రభుత్వంపై విషం చల్లుతూ నాటకాలు అడుతున్నారని విమర్శించారు. ప్రజలను పక్కదారి పట్టించడానికి దొంగ ఓట్ల నాటకం అడుతున్నారన్నారు. కుప్పంలో 30 వేల దొంగ ఓట్లు బయట పడ్డాయని, ఈఓట్లతో గెలుపొందిన చంద్రబాబు ఈసారి అక్కడే ఓడిపోతారని గుర్తుంచుకోవాలన్నారు. పచ్చ మీడియా పనిగట్టుకొని చంద్రబాబుకు ప్రచారం చేస్తోందని సునీత దుయ్యబట్టారు. ఎన్నికల కమిషన్ అర్హులైన ప్రతి ఓటరుకూ ఆధార్ అనుసంధానం చేస్తుందన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

బాపట్ల అర్బన్: భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవంతోపాటు, మాతృభాష దినోత్సవాన్ని చెరువు జమ్ములపాలెం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ శిక్షణ, పరిశోధన సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటిన వారిని అభినందించారు. ప్రతిభావంతులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.కృష్ణారావు, పీడీ వీరచంద్ర, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో వదిలేసిన బ్యాగు అప్పగింత

అందులో ఉన్న రూ.12 లక్షలు భద్రం



చీరాల అర్బన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు వదిలేసిన బ్యాగ్‌ను తిరిగి అతడికి ఆర్టీసీ అధికారులు అప్పగించారు. అందులో ఉన్న రూ.12 లక్షలు భద్రంగా ఉండడంతో ప్రయాణికుడు ఊపిరిపీల్చుకున్నాడు. సేకరించిన సమాచారం మేరకు చీరాల విఠల్‌నగర్‌కు చెందిన తన్నీరు ఏడుకొండలు ఒంగోలులో చీరాల బైపాస్ రైడర్ బస్సు ఎక్కాడు. బ్యాగ్‌ను బస్సులో పెట్టి మళ్లీ కిందకు దిగి వాష్‌రూమ్‌కు వెళ్లాడు. అతడు వచ్చేసరికి బస్సు బయలుదేరి పోయింది. దీంతో విషయాన్ని చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోల్ రూంకు సమాచారం ఇచ్చాడు. అలానే వేటపాలెంలోని అతని బంధువులకూ చెప్పడంతో వారు చీరాల వచ్చారు. మరో బస్సులో అతడు చీరాలకు చేరుకున్నాడు. అప్పటికే ఆర్టీసీ సిబ్బంది ఆ బస్సులో ఉన్న బ్యాగ్‌ను సురక్షితంగా ఉంచారు. బస్టాండ్‌కు వచ్చిన అతడు పూర్తి వివరాలను డిపో మేనేజర్ జె.శ్యామలకు వివరించాడు. ఆ బ్యాగ్‌లో రూ.12 లక్షల నగదు ఉందని చెప్పడంతో అందరూ నిర్ఘాంతపోయారు. ఇల్లు అమ్మిన నగదు అని వివరించాడు. దీంతో అతని పేరు, టికెట్, ఆధార్ కార్డు, నగదు వివరాలను నమోదు చేసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారం సరిచూసుకొని బ్యాగ్‌ను డిపో మేనేజర్ అందించారు.

తెలుగు భాషా వికాసానికి గిడుగు కృషి

కలెక్టర్ పి.రంజిత్‌బాషా



కవులు, రచయితలను సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: తెలుగు భాషా వికాసానికి గిడుగు వెంకట రామ్మూర్తి చేసిన సేవలను అందరూ స్మరించుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. మంగళవారం గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవహారిక భాషాభివృద్ధికి గిడుగు కృషి చేశారని కొనియాడారు. ప్రముఖ కవులు, రచయితలను కలెక్టర్ సన్మానించారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్ద అద్దంకి పద్య శాసనం పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు,నందనము శ్రీనివాసరావు, మన్నే శ్రీనివాసరావు, దివి శ్రీరామ్ మూర్తి, రావూరి నరసింహారావు వర్మ, పోలాసం వీరాజనేయులు, కె.రాజేశ్వరి, జొన్నలగడ్డ సాధు హెర్బిట్ ,బి.ఎస్.నారాయణ భట్టు, నందిరాజు విజయ్ కుమార్,పరిమి సుబ్రమణ్య చారి తదితరులు పాల్గొన్నారు.

రక్షక్ వనభోజనశాలకు దరఖాస్తులు ఆహ్వానం

- లాటరీ పద్ధతిలో భోజనశాల అప్పగింత
- ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో కొత్తగా నిర్మించిన రక్షక్ వన భోజనశాల నిర్వహణను ఔత్సాహికులకు లాటరీ పద్ధతిలో అందజేస్తామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రక్షక్ వనభోజనశాలను అద్దె పద్ధతిలో అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వివరించారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఈనెల 31 సాయంత్రం 5 గంటల లోపు జిల్లాలోని ఏఆర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం లాటరీ పద్ధతి ద్వారా రక్షక్ వన భోజనశాల నిర్వాహకుడిని ఎంపిక చేస్తామని వెల్లడించారు. భోజనశాలను నిర్వహించే వ్యక్తులు నెలకు రూ.10 వేలు అద్దె చెల్లించాలని, ప్రతి నెలా 5వ తేదీ ముందుగానే జమ చేయాలని సూచించారు. కార్యాలయ పనిదినాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్యాంటిన్ అందుబాటులో ఉండాలన్నారు. ఏటా రూ.1,000 చొప్పున అద్దె పెంచుతామని చెప్పారు. ఉన్నతాధికారులు నిర్ణయించిన ధరలకే తినుబండారాలను విక్రయించాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ అప్పగించే క్యాంటిన్ వస్తువులకు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

పేదల గృహనిర్మాణాల్లో పురోగతి భేష్

- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి
- గృహనిర్మాణ సంస్థ ఎండీ శివప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్

బాపట్ల: జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణంలో పురోగతి కనిపిస్తోందని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ అధికారులకు సూచించారు. గృహనిర్మాణాల ప్రగతిపై అధికారులతో మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణ లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు. బాపట్ల జిల్లాలో 31,109 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆగస్టు 30 నాటికి 11 వేల గృహాలను పూర్తిచేయాలనేది లక్ష్య కాగా, అధికారులు సమష్టి కృషితో 11 వేల 871 గృహాలు పూర్తిచేశారని ప్రశంసించారు. పునాది దశలోని గృహాల నిర్మాణం 50 శాతం పురోగతిలో ఉందన్నారు. జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయల కల్పన కూడా బాగుందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 6,267 గృహాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయని, అందులో 2,237 పూర్తయ్యాయని వివరించారు. ఉపాధిహామీ పథకం ద్వారా కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రగతి గురించి శివప్రసాద్ అడిగి తెలుసుకున్నారు.

యుద్ధప్రాతిపదికన ఇంకుడుగుంతలు

జగనన్న కాలనీల్లో యుద్ధప్రాతిపదికన ఇంకుడుగుంతలు తవ్వాలని కలెక్టరు పి.రంజిత్ బాషా చెప్పారు. ప్రస్తుతం రూఫ్ దశలోని 2,899 గృహాలకు ఇంకుడుగుంతలు మంజూరు చేయగా వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 1,600 ఇంకుడు గుంతలకు గ్రామపంచాయతీలో తీర్మానాలు, అనుమతులు తీసుకోవాలన్నారు. వీటిపై ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. 10,600 గృహాలు ఇంకా పునాదికి దిగువ స్థాయిలో ఉండడంపై ఆరా తీశారు. వేటపాలెం మండలం కొణిజేటి నగర్–2లోని 273 గృహాల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. ఈనెల 30న ఆ కాలనీలోని గృహాలను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. బాపట్ల జిల్లాలో గృహాల నిర్మాణంలో పురోగతి సాధించడంపై కలెక్టర్ పి.రంజిత్ బాషాను రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ వై.శంకర్ నాయక్, డీఆర్డీఏ పీడీ బి.అర్జున్‌రావు పాల్గొన్నారు.

స్టూడెంట్ ఇన్ఫోలో పక్కాగా నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- గ్రోత్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోపై సమీక్ష

బాపట్ల: చిన్నారుల వివరాలను అధికారులు స్టూడెంట్ ఇన్ఫోలో పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. గ్రోత్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోపై ఎంపీడీవోలు, విద్యాశాఖ అధికారులతో మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఐదు నుంచి 18 సంవత్సరాల వయసులోపు చిన్నారులు 2,03,156 మంది చిన్నారులు ఉన్నట్లు గణాంకాలు ఉండగా, గ్రామాలలో వలంటీర్ల ద్వారా సర్వే చేయగా 2,00,076 మంది ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 99,926 మంది నివాసముంటుండగా సమగ్ర సర్వే ద్వారా 94,999 మందిని గుర్తించి వారి వివరాలను స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేశారని తెలిపారు. మిగిలిపోయిన 4,927 మంది వివరాలను తక్షణమే సర్వే ద్వారా గుర్తించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన 15,183 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ వంటి వివిధ కోర్సులలో చేరారని తెలిపారు. పదో తరగతి ఫెయిల్ అయిన 3,500 మంది విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించామన్నారు. జిల్లాలో ఉన్న 8,480 మంది వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలలో సర్వే నిర్వహించారని వివరించారు. 18 సంవత్సరాలలోపు చిన్నారులు ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు, మృతులు, వలస, శాశ్వత వలసలు వెళ్లిన వారి వివరాలను సైతం స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలను కూడా ఇందులో పొందుపరచాలన్నారు. చిన్నారులపై నిర్వహిస్తున్న సర్వే పక్కాగా ఉండాలని, సెప్టెంబర్ ఎనిమిదో తేదీలోగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నిజాంపట్నం మండలంలో 8,516 మంది చిన్నారులు ఉండగా వారి పూర్తి వివరాలను నూరు శాతం నిక్షిప్తం చేశారన్నారు. నూరు శాతం సర్వే పూర్తయిన మండలాలలో కారంచేడు, జె.పంగులూరు, అద్దంకి, అమర్తలూరు మండలాలు ఉండడంపై కలెక్టర్ అభినందించారు. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయా మండలాలలో మిగిలిపోయిన వారి వివరాలపై మండలాల వారీగా ఆయన సమీక్షించారు. పిట్టలవానిపాలెం మండలంలో సర్వేలో 4,915 మంది మిగిలిపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. అక్కడ 45 శాతం నమోదుపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇంకొల్లు మండలంలో 614 మంది, కొరిశపాడు లో 652, చెరుకుపల్లిలో 523, మార్టూరులో 532 మంది వివరాలు పెండింగ్‌లో ఉండడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పీవీ రామారావు, డీఎల్‌డీఓ రాజేష్, ఇంటర్మీడియట్ బోర్డు డివిజినల్ ఆర్ఐఓ ఆంజనేయులు, డీపీఓ డి.రాంబాబు పాల్గొన్నారు.

మద్యం, మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

- నేరాల అదుపునకు సాంకేతిక పరిజ్ఞానం
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

కారంచేడు: ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమంగా వస్తున్న మద్యంతోపాటు, ఇతర మత్తు పదార్థాల తరలింపులపై నిరంతర నిఘా ఉంచుతున్నామని.. నేరాల అదుపుపై ఉక్కుపాదం మోపనున్నట్లు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని కారంచేడు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. మొదటిసారిగా స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు, లారీలను (ప్రాపర్టీ వాహనాలు) ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రాపర్టీ నేరాలు జరగకుండా బీట్‌ను పటిష్టపరుస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాల కట్టడిపైనా నిరంతర నిఘాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పలు కేసులను ఛేదించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుస్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగే నేరాలు ఎలా ఉన్నాయి, రౌడీలు, సస్పెక్ట్‌లు, పాతనేరస్తులు, వారి ప్రస్తుత జీవన విధానం, కుటుంబ తగాదాలు, వర్గ విభేదాలు వంటి విషయాలపై ఆయన ప్రతి ఒక్కరి నుంచి సమాధానం అడిగి తెలుసుకున్నారు. సచివాలయ మహిళా పోలీస్‌లు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, మరింత అంకితభావంతో పనిచేస్తూ మీ గ్రామాల్లో ఎదురయ్యే పూర్తి సమాచారాన్ని మీ ఎస్‌హెచ్‌ఓలకు అందించాలన్నారు. స్టేషన్ పరిధిలో పోలీసు సిబ్బంది వారి దత్తత గ్రామాలను వారానికి ఒకసారైనా తప్పకుండా సందర్శించాలన్నారు. స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులను, సీడీ ఫైల్స్‌ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన ప్రదేశాలు, రహదారులపైన సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి ఆ ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సిబ్బందికి వివరించారు. మహిళలు, మైనర్ బాలికలపై ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలుంటాయన్నారు.

పర్యావరణానికి అందరం కృషి చేద్దాం..

మనందరం మన ప్రాంతంలో కనీస పర్యావరణ పరిరక్షణకు బాధ్యులుగా ఉందామని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. ఆయన కారంచేడు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఒక మొక్కను నాటారు. ప్రతి ఒక్కరం ఒక్కో మొక్క నాటడం వలన పర్యావరణం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ప్రసాదరావు, బాపట్ల స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీ సూర్యనారాయణ, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం ఎస్సైలు జీ శ్రీనివాసరావు, నాయబ్‌రసూల్, సురేష్, హరికృష్ణ, ఏ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

జాయింట్ కలెక్టర్ శ్రీధర్

పర్చూరు (చినగంజాం): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అన్నారు. మంగళవారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఆయ న మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఎన్నికల కమిషన్ ని బంధనల ప్రకారం పని చేయాలని సూచించారు. యదార్థంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రసక్తే లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో నకిలీ ఓట్లు ఉన్నాయని ఇటీవల కొందరు నాయకులు ఎన్నికల కమిషన్ దృష్టి కి తీసుకెళ్లారు. విచారణ నిమిత్తం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి జేసీని నియమించిన మీదట ఆయన పర్చూరు వచ్చి అధికారులతో చర్చించారు. కార్య క్రమంలో ఈఆర్వో వెంకట నారాయణ, తహసీల్దా ర్ సంధ్యశ్రీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 30న ఆహ్వాన నాటకోత్సవాలు

పాత గుంటూరు: సినీ నటుడు అల్లు రామలింగయ్య శత జయంతిని పురస్కరించుకుని నాటక రంగాన్ని ప్రోత్సహించేలా సెప్టెంబరు 30, అక్టోబరు 1న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పి. శివప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న కళాకారులు 80741 48228 నెంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

త్వరలో జగనన్న కాలనీలు ప్రారంభం

ఏపీఎస్‌హెచ్‌సీఎల్ జేఎండీ శివప్రసాద్


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేఎండీ శివప్రసాద్

వేటపాలెం: త్వరలో జగనన్న కాలనీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభిస్తామని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని బచ్చులవారిపాలెం వెళ్లే రోడ్డు దగ్గరలో నూతనంగా నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ కొణిజేటినగర్–2 కాలనీని జేసీ, జేఎండీ, హౌసింగ్ అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. ముందుగా లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, కాలనీలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జేఎండీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. వీటిలో 11 లక్షలు ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. జిల్లాలో 31,239 ఇళ్లు లబ్ధిదారులకు మంజూరు చేశామని, వీటిలో 11,400 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణం పూర్తైన కాలనీలను సీఎం జగన్ సెప్టెంబర్ 10న ప్రారంభిస్తున్నారని చెప్పారు.

వేటపాలెం మండలం పరిధిలో..

మండలం పరిధిలో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీ అదే రోజున ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో 303 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు పంపిణీ చేశామని, 283 మంది లబ్ధిదారులకు పక్కా గృహాలు మంజూరు చేశారని చెప్పారు. ప్రస్తుతం 243 గృహాలు నిర్మాణాలు ప్రారంభించగా 203 గృహాలు తుదిదశకు చేరుకున్నాయని, మరో పదిరోజుల్లో పూర్తికానున్నాయన్నారు. కాలనీకి ముందు భాగంగా రూ.6.75 లక్షలతో ఆర్చీ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కాలనీలో మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నామని తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కల్పన వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అన్ని గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇంత సుదరంగా మోడల్ కాలనీగా రూపొందించడం ఆనందంగా ఉందని హౌసింగ్ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, పీఆర్ డీఈ శేషయ్య, విద్యుత్ డీఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీవో దాసు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి

- అవసరమైన ప్రాంతాల్లో అదాలత్‌లు
- ప్రకాశం ఎస్ఈ కే సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

మార్టూరు: రైతులు, విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అధికారులందరూ కృషి చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కే సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ఇంటూరి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మార్టూరు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మండలాల వారీగా సమస్యలు, పరిష్కారాలు, బిల్లుల వసూళ్ల గురించి సమీక్షించారు. డిజిటల్ మీటర్లు సిద్ధంగా ఉన్నా యని అవసరమైన వారు తెప్పించుకొని వినియోగదారులకు ఏర్పాటు చేయాలన్నారు. బిల్లుల వసూళ్లలో యద్దనపూడి మండల అధికారులు మెరుగ్గా ఉన్నారని చెప్పారు. మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల వారు పనితీరు మెరుగుపరచుకోవాలని, లేకుంటే చర్యలకు వెనుకాడబోమన్నారు. సిబ్బంది కొరతగా ఉన్నచోట పని తక్కువగా ఉన్న మండలాల నుంచి సర్దుబాటు చేసుకొని సమస్యలు, బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. త్వరలో ఏఈలు, లైన్‌మెన్‌లు ఖాళీలను భర్తీ చేసి పని ఒత్తిడి తగ్గిస్తాయని తెలిపారు. మార్టూరు ఏఈగా పనిచేసిన శ్రీనివాసరావు అవకతవకలపై చర్యలు తీసుకుంటామని విలేకరులతో ఆయన తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి డీఈ నల్లూరి మస్తాన్ రావు, మార్టూరు ఏడీఈ మువ్వా సురేంద్రబాబు, ఏఈలు కిరణ్, దేవక్, సురేష్, శ్రీనివాసరావు, జేఈ హనుమంతరావు, లైన్‌మెన్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు,

ప్రజలను మోసగించేందుకు కుట్రలు

- అధికారం కోసం చంద్రబాబు ఎవరితోనైనా పొత్తు పెట్టుకుంటాడు
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: నిన్నమొన్నటి వరకు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకున్న టీడీపీ, బీజేపీలు ఒక్కటే అనే సంకేతాలు ఇస్తూ రానున్న ఎన్నికల్లో ప్రజలను మోసగించేందుకు సిద్ధమౌతున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు విమర్శించారు. మండలంలోని కళ్లిఫలం పంచాయతీ పరిధిలోని కోనఫలంలో గ్రామంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఒక వైపు చంద్రబాబు, మరో వైపు పురందేశ్వరి, నడ్డా, సీఎం రమేష్, సుజనా చౌదరిలు కలయికలు ప్రజలు పెద్దగా ఆశ్చర్యపోవటం లేదన్నారు. ఎన్నికల్లో ఎవరితోనైనా పొత్తు పెట్టుకుంటామని చంద్రబాబు అంటున్న మాటలు పెద్దగా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. చంద్రబాబు తన స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తాడన్నారు. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచి ఆయన మరణానికి కారణమైన చంద్రబాబు అధికారం కోసం ఎన్ని అడ్డదారులైన తొక్కడానికి సిద్ధపడతాడన్నారు. కేంద్రంలో టీడీపీ భాగస్వామిగా ఉన్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు చిహ్నంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించని చంద్రబాబు నేడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్టీ రామారావుకు జాతీయ స్థాయిలో గౌరవం అందించే కార్యక్రమాల్లో అంతా తానే అన్నట్లు ప్రజలను మోసగించే కుట్రలకు పాల్పడుతున్నడన్నారు. అధికారం కోసం పిల్లనిచ్చిన మామను, అధికారం దక్కగానే ఓట్లు వేసిన ప్రజలను మోసగించటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అవకాశవాద రాజకీయాలకు చంద్రబాబుకు మించిన నాయకుడు దేశంలోనే లేడన్నారు. ఎన్ని పొత్తులు ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబుకు ప్రజలు మరో మారు బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

జగనన్న సంక్షేమ పాలనే ఎన్నికల అజెండా

రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్.జగనన్న పాలనే అజెండాగా ముందుకు వెళతామన్నారు. ఓ నూతన సంక్షేమ పాలనకు దేశంలోనే ఆంధ్ర రాష్ట్రం వేదికగా నిలిచిందన్నారు. రాజకీయాలకు, కులాలకు, మతాలకతీతంగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి పేదవాడు జగనన్న సంక్షేమ పాలనను కోరుకుంటున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ఎటువంటి అవినీతి లేకుండా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్న పాలనలోనే సాధ్యపడుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని రానున్న ఎన్నికల్లో మరో మారు జగనన్నకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు

ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్


గిడుగు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్

బాపట్లటౌన్: వ్యవహారిక భాషోద్యమానికి మూల పురుషుడు గిడుగు రామ్మూర్తి అని ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది గిడుగు వెంకట రామ్మూర్తిని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలుగుభాష కఠినమైన గ్రాంథిక రూపంలో ఉండేదని, అర్థం చేసుకోవడం చాలా కష్టంగా ఉండేదని, అప్పట్లో ఉపాధ్యాయుడిగా ఉన్న తెలుగు భాషా శాస్త్రవేత్త గిడుగు రామ్మూర్తి సమస్యను గుర్తించి, తెలుగు భాషను మనం సాధారణంగా మాట్లాడే వ్యావహారిక భాషలోనే బోధించాలని, రాయాలనీ ఒక ఉద్యమాన్నే చేశారన్నారు. ఆయన ఎన్నో ఏళ్ల పోరాట ఫలితమే ప్రస్తుతం మనం రాస్తున్న తెలుగు భాష అన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మన్మధరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్‌నాయక్, డీపీవో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యశాఖ సహాయకుడికి డాక్టరేట్


ఉపకులపతి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న సచివాలయ ఉద్యోగి డార్విన్

చీరాల టౌన్: వాడరేవు గ్రామ సచివాలయంలో (సచివాలయ ఉద్యోగి) మత్స్య సహాయకుడిగా పని చేస్తున్న చాట్లా డార్విన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నారు. ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో భాగంగా వివిధ విభాగాలపై పరిశోధనలు చేసిన స్కాలర్స్‌లకు పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. సచివాలయ ఉద్యోగి చాట్లా డార్విన్ చేసిన జువాలజీ విభాగంలో 'ఫిష్ డైవర్సిటీ, డీఎన్ఏ బార్ కోడింగ్ అండ్ న్యూట్రీషనల్ వ్యాల్యూ ఆఫ్ కమర్షియల్ ఇంపార్టెంట్ గ్రూపర్ ఫిషెస్ ఫ్రమ్ నిజాంపట్నం సౌత్ ఈస్ట్ కోస్ట్ ఆఫ్ ఇండియా' అంశంపై ఆచార్య పి.పద్మావతి పర్యవేక్షణలో చేసిన పరిశోధన చేశాడు. ఇందుకు ఉత్తమ పరిశోధనకు ఎంపిక కావడంతో యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్యా రాజాశేఖర్ డాక్టరేట్ ప్రదానం చేశారు. సచివాలయ మత్స్యశాఖ సహాయకులుగా విధులు నిర్వహిస్తునే పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందిన డార్విన్‌ను బాపట్ల జిల్లా మత్స్యశాఖ జేడీ పి.సురేష్, ఏడీ కృష్ణ కిషోర్, ఎఫ్‌డీవో రాజ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

పోలీసులపై తప్పుడు కేసు


మాట్లాడుతున్న రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ


చుండూరు(వేమూరు): తనను హింసించారంటూ చుండూరుకు చెందిన గుదేటి బాలకోటిరెడ్డి పలువురు పోలీసులపై ప్రైవేటు కేసు వేశారని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. చుండూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చుండూరు గ్రామానికి చెందిన గుదెటి బాలకోటిరెడ్డి తండ్రి శ్రీనివాస రెడ్డి కొద్ది కాలం కిందట మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాసరెడ్డి తల్లి లక్ష్మి మోదుకూరు వెళ్లి నివాసం ఉంటున్నట్లు చెప్పారు. అయితే ఆమెకు చుండూరు గ్రామంలో నాలుగు ఎకరాలు భూమి ఉందని తెలిపారు. ఆస్తి కోసం ఆమెను హత్య చేసేందుకు మనవడు బాలకోటిరెడ్డి ప్రణాళిక సిద్ధం చేశాడు. జూలై 1వ తేదీన గుదేటి బాలకోటిరెడ్డి, కొంత మంది స్నేహితులు బీరు బాటిల్, పెట్రోల్ బాటిల్ తీసుకొని మోదుకూరులోని ఆమె ఇంటికి వెళ్లారు. ఇంటి చుట్టూ, తలుపులు వద్ద పెట్రోలు పోసి చంపుతామని బెదిరించారని తెలిపారు. దీంతో రెండో తేదీన చుండూరు పోలీసు స్టేషన్‌లో బాలకోటిరెడ్డి అతని స్నేహితులపై లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో బాలకోటిరెడ్డి, అతని ఇద్దరు స్నేహితులను అరెస్టు చేసి తెనాలి కోర్టుకు హాజరు పర్చినట్లు డీఎస్పీ చెప్పారు. వారిని కోర్టు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నెల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారని, అనంతరం తనను హింసించారంటూ ఈనెల 29వ తేదీన తెనాలి రెండవ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో చుండూరు సీఐ రాజమోహన్, చుండూరు, ఎస్ఐ నవీన్, అమర్తలూరు ఎస్ఐ సురేష్, కొల్లూరు ఎస్ఐ రాజ్యలక్ష్మి, భట్టిప్రోలు ఎస్ఐ చంద్రశేఖర్, నగరం ఎస్ఐ రామకృష్ణలపై కోర్టులో ప్రైవేటు కేసు వేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజమోహన్, ఎస్ఐ భరత్ పాల్గొన్నారు.

వలపు వల..

- ప్రియుడిని ఇంటికి పిలిచి.. బెదిరించి డబ్బులు దోచుకున్న ప్రియురాలు!
- తెనాలిలో ఘటన

తెనాలి రూరల్: ప్రేమ పేరుతో వ్యక్తికి వల వేసి ఇంటికి పిలిపించిన మహిళ ఆమె పరిచయస్తులతోపాటు, మరో ఇరువురితో కలిసి డబ్బులు దోచుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాల ప్రకారం కొల్లిపర మండలం సిరిపురానికి చెందిన వివాహిత భర్తతతో విబేధాల కారణంగా తెనాలి నాజర్‌పేటలో పిల్లలతో కలిసి ఉంటోంది. ఈమెకు కొల్లిపర మండలానికి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతనితో తరచూ ఫోన్‌లో మాట్లాడేది. సోమవారం సాయంత్రం అతనిని తెనాలిలోని తన ఇంటికి రావాలని పిలిపించింది. అతను రాగానే తెనాలిలో ఈమె సహజీవనం చేస్తున్న వ్యక్తి మరో పరిచయస్తుడిని ముందుగా పిలిచి ఇంట్లో ఉంచింది. వారితో కొల్లిపర నుంచి వచ్చిన వ్యక్తి, ఈమె కలిసి ఉన్న ఫొటోలు తీయించింది. అనంతరం తనకు డబ్బులు ఇవ్వాలని, లేదంటే ఫోటోలు బంధువులకు చూపిస్తామని బెదిరించడంతో అప్పటికప్పుడు రూ.1.40 లక్షలు వారికి ఇచ్చి బయటకు వచ్చాడు. రాత్రి పోలీసులను ఆశ్రయించాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.చంద్రశేఖర్ తెలిపారు.

నిమ్మగడ్డ వారిపాలెంలో కేంద్ర బృందం పర్యటన


నిమ్మగడ్డవారిపాలెంలో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ప్రత్తిపాడు: మండల పరిధిలోని నిమ్మగడ్డ వారిపాలెంలో మంగళవారం కేంద్ర బృందం పర్యటించింది. ఫౌండేషన్ ట్రైనింగ్ లో భాగంగా ఆరుగురు బృందంతో కూడిన సెంట్రల్ సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు భారత్ దర్శన్ నిమిత్తం గ్రామాలను సందర్శిస్తున్నారు. అందులో భాగంగా ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డ వారి పాలెం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన రక్షిత మంచినీటి చెరువును పరిశీలించారు. చెరువు చుట్టూ గట్లపై నాటిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. పథకం వివరాలను స్థానిక ఏపీవో షేక్ మస్తాన్ వలి వివరించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలు అమలు చేస్తున్న పలు పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వెంట ఏపీఎస్ఐఆర్డీ నోడల్ ఆఫీసర్ ఏ శేఖర్ బాబు, ఈవోపీఆర్డీలు శ్రీనివాస రావు, మోషే, సర్పంచ్ జి. పద్మావతి సతీష్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించండి

వ్యవసాయశాఖకు సూచించిన జిల్లా కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో పత్తిపంట సాగు తగ్గినందున రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. సుమారు 70వేల ఎకరాల్లో పత్తిపంట తగ్గనుందన్నారు. ఈ మేరకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించి విత్తనాలు అందజేసి సాగుజరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నల్లరేగడి భూముల్లో మినుము, పెసర, కంది పంటలను వచ్చే సెప్టెంబరు 15 నుంచి సాగుచేయాలని, లేనిపక్షంలో అక్టోబరు నుంచి మంచి శనగ సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొద్దిపాటి సాగునీరు సౌలభ్యం ఉన్నచోట మొక్కజొన్న, రాగి, జొన్న, సజ్జ లాంటి పంటలను సాగుచేసి రైతులు తమ భూమిని ఖాళీగా ఉంచకుండా ఆదాయాన్ని పొందేవిధంగా ఆర్‌బీకేల ద్వారా రైతులకు తెలియచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, అభ్యుదయ రైతులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.